ప్రజాశక్తి
గురువారం 13 జూన్ 2024
5
అల్లూరి సీతారామరాజు

మోదకొండమ్మ ఉత్సవాలు జయప్రదం

- జిల్లా కలెక్టర్ విజయ సునీత

ప్రజాశక్తి-పాడేరు: ఈ నెల 9 నుండి 11వ తేదీ వరకు జరిగిన మోదకొండమ్మ అమ్మవారి జాతర జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికీ జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత ధన్యవాదాలు తెలిపారు. అందరి సమిష్టి కృషితో అమ్మవారి జాతర నిర్వహణగా, ప్రశాంతంగా నిర్వహించామని అభినందించారు. సబ్ కలెక్టర్ ఆ మూడు రోజులు రక్త దాన శిబిరం ఏర్పాటు చేశారని అభినందించారు. పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రత కల్పించి ఉత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలు కాపాడారని కొనియాడారు. ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ బృందాలు ఉత్సాహంగా పని చేశాయన్నారు.సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకునే విధంగా నిర్వహించారని, బ్రహ్మ కుమారీస్ పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా భక్తులకు సేవలు అందించారని సంతోషాన్ని వ్యక్తపరిచారు. వైద్యశాఖ, ఆర్‌టిసి సేవలపై అభినందించారు.

సీనియర్లకు దక్కని చోటు

-రాష్ట్ర మంత్రివర్గంలో ఉమ్మడి విశాఖ నుంచి అనిత ఒక్కరికే అవకాశం
- అయ్యన్న, గంటా, కొణతాల,
బండారు, పల్లా, వెలగపూడిలకు ఆశాభంగం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, గ్రేటర్ విశాఖ బ్యూరో, విశాఖ కలెక్టరేట్

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో చంద్రబాబు ప్రభుత్వంలో సీనియర్లకు చోటు దక్కలేదు. గతంలో రెండు మంత్రి పదవులున్న ఉమ్మడి జిల్లాలో ఈ సారి ఒకటికే చంద్రబాబు పరిమితం చేశారు. మంత్రివర్గంలో ముందు వరుసలో చోటు దక్కుతుందని పూర్తి విశ్వాసంతో వున్నవారికి స్థానం లేకుండాపోయింది. కూటమి సర్దుబాట్లులో తనకు మంత్రి పదవి వచ్చే అవకాశం చిట్టచివరన వుండనుకొనే పాయకరావుపేట టిడిపి ఎమ్మెల్యే వంగలపూడి అనితకు మంత్రి పదవి లభించింది. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి సిహెచ్.అయ్యన్నపాత్రుడుకు మంత్రి పదవి ఇవ్వకపోవడం చర్చనీయాంశమైంది. ఉమ్మడి విశాఖ జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో ఏజెన్సీలోని రెండు మినహా మిగిలిన 13 చోట్ల కూటమి అభ్యర్థులు గెలిచారు. కానీ ఒకరికే మంత్రివర్గంలో అవకాశం కల్పించారు. గెలిచిన కూటమి ఎమ్మెల్యేలు 13 మందిలో అయ్యన్నపాత్రుడు సీనియర్ నాయకుడు. టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీని అంటిపెట్టుకొని పనిచేస్తున్న నిబద్ధత కలిగిన నాయకుడుగా గుర్తింపు వుంది.

అధికారంలో లేని కాలంలో కూడా పార్టీ శ్రేణుల్లో ధైర్యం నింపేందుకు అధికారపక్షంపై ఘాటైన విమర్శలు చేయడానికి ఏ మాత్రమూ అయ్యన్న భయపడలేదు. తనపై వివిధ రకాల కేసులు పెట్టినా వెనుకడలేదు. పార్టీకి అత్యంత విధేయునిగా పనిచేసిన ఆయనకు మంత్రివర్గంలో చోటు ఇవ్వకుండా చంద్రబాబు వెనక్కినెట్టారు. టిడిపి ఏర్పడిన నాటి నుంచి 2024 వరకు జరిగిన పది ఎన్నికల్లో నర్సీపట్నం నుంచి ఏడు సార్లు ఎమ్మెల్యేగానూ, ఒకసారి అనకాపల్లి ఎంపీగానూ అయ్యన్న గెలిచారు. ఎన్‌టిఆర్ మంత్రివర్గంలో సాంకేతిక విద్యాశాఖమంత్రిగా పనిచేశారు. ఆ తరువాత టిడిపి ప్రభుత్వాల్లో రహదారులు, భవనాల శాఖ మంత్రిగా, అటవీ శాఖ మంత్రిగా, పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా వున్నారు. టిడిపిలో చంద్రబాబు కంటే సీనియర్ నాయకుడైన అయ్యన్నను పక్కనబెట్టి రెండుసార్లు పాయకరావుపేట నుంచి గెలిచిన వంగలపూడి అనితకు మంత్రివర్గంలో స్థానం కల్పించడంతో ఆయనను అవమానపర్చినట్లయింది.

జనసేన నుంచి విజయం సాధించిన ఎమ్మెల్యేల్లో అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు గతంలో పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీ ప్రకారం మంత్రి పదవి లభిస్తుందని ఆ పార్టీ కార్యకర్తలు ఆశపడ్డారు. కొణతాల రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి, ఒకసారి మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. రెండుసార్లు అనకాపల్లి కాంగ్రెస్ ఎంపీగా గెలిచారు. భీమిలి టిడిపి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఐదు సార్లు, బండారు సత్యనారాయణమూర్తి ఐదుసార్లు, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు నాలుగుసార్లు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు వరుసగా నాలుగుసార్లు విజయం సాధించారు. గంటా, బండారు మంత్రులుగానూ పనిచేశారు. భారీ మెజార్టీతో గెలిచిన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి, గంటాలో ఒకరికి మంత్రి పదవి వస్తుందని భావించారు. కానీ సీనియర్లను చంద్రబాబు పక్కనబెట్టి తన మంత్రివర్గంలో.. కొత్త వారితో ఎస్‌సి మహిళ కోటాలో అనితకు ప్రాధాన్యత ఇచ్చినట్లు కనబడింది. మంత్రివర్గ కూర్పును పరిశీలిస్తే చంద్రబాబు కనుసన్నల్లో నడిచే వారికే మంత్రి పదవి కట్టబెట్టినట్లుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

విశాఖ జిల్లాకు నో బెర్త్!

రాష్ట్ర మంత్రివర్గంలో విశాఖ ఎమ్మెల్యేలెవరికీ చోటు దక్కలేదు. మంగళవారం జరిగిన ఎన్‌డిఎ శాసన సభా పక్ష సమావేశంలో విశాఖకు అత్యధిక ప్రాధాన్యమివ్వడమే కాకుండా ఆర్థిక, ఆధునిక రాజధానిగా తీర్చిదిద్దుతామని చంద్రబాబు అన్న మాటలతో విశాఖ నుంచి మంత్రి పదవులు ఆశించేవారి సంఖ్య పెరిగినా అది ఎంతోసేపు నిలువలేదు. మంత్రివర్గంలో ఒక్కరంటే ఒక్కరిని తీసుకోకపోవడం పట్ల విజేతలైన ఎమ్మెల్యేలను నిరాశ పరిచినట్లయింది. భీమిలి, గాజువాక నియోజకవర్గాల నుంచి గెలిచిన గంటా, పల్లాలకు 90 వేలు పైచిలుకు మెజార్టీలు వచ్చాయి. ఇవి రాష్ట్రంలోనే అధికం. వారికి ఈసారి నిరాశే ఎదురైంది.

నెరవేరిన అనిత కల

- నాడు ఉపాధ్యాయిని.. నేడు మంత్రి

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, నక్కపల్లి విలేకరి

పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత కల నెరవేరింది. మంత్రి కావాలన్న ఆమె ఆశను చంద్రబాబు నెరవేర్చారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలుగా ఆమె జీవితం ప్రారంభించి, ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి ప్రవేశించి రాష్ట్ర మంత్రి అయ్యారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా సబ్బవరంలో వంగలపూడి అప్పారావు, స్నేహలత దంపతులకు 1979 మార్చి 24న అనిత జన్మించారు. ఎంఎ, ఎంఇడి వరకు చదువుకున్నారు. తొలుత పాయకరావుపేట మండలం, రాజవరం శివారు గజపతినగరంలో ఆమె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలిగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించారు. వేములపూడిలో కొంతకాలం పని చేశారు. తరువాత ఓపెన్ స్కూల్ జిల్లా కో -ఆర్డినేటర్‌గా పనిచేస్తూ, ఉద్యోగానికి రాజీనామా చేసి 2013లో టిడిపిలో చేరారు. పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బాధ్యతలు చేపట్టిన తరువాత జరిగిన 2014 ఎన్నికల్లో పాయకరావుపేట ఎస్‌సి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2019 ఎన్నికల్లో కొవ్వూరు నుంచి పోటీచేసి ఓటమి చెందారు. మళ్లీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బాధ్యతలు చేపట్టారు. 2021లో తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షురాలుగా, 2022 టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యురాలుగా నియమితులయ్యారు. 2024 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి కంబాల జోగులుపై విజయం సాధించి ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి ఎస్‌సి కోటాలో మంత్రి అయ్యారు. అనితకు భర్త శివప్రసాద్, పిల్లలు నిఖిల్, రేష్మితశ్రీ వున్నారు.

వైద్యసేవలకు సన్నద్ధంగా ఉండండి

● వైద్యాధికారులు, సిబ్బందిని కోరిన ఎంపిపి లక్ష్మి

మాట్లాడుతున్న ఎంపిపి కారం లక్ష్మి

ప్రజాశక్తి-విఆర్ పురం: వర్షాల సీజన్, గోదావరి వరదలు సమయంలో మండలంలోని రేఖపల్లి, రాయిగూడెం పిహెచ్‌సిల పరిధిలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందు రాకుండా మెరుగైన వైద్యసేవలు అందించే దిశగా వైద్యాధికారులు, సిబ్బంది పనిచేయాలని ఎంపిపి కారం లక్ష్మి అన్నారు. బుధవారం రేఖపల్లి మండల పరిషత్ కార్యాలయంలోసమావేశంలో మాట్లాడుతూ జిల్లాఅధికారులతో మాట్లాడి, వరద సమయంలో అవసరమైన అత్యవసర మందులను ముందుగానే తెప్పించుకుని నిల్వ ఉంచాలన్నారు. బాధితులకు అవసరమైన వైద్యసేవలకు ఇబ్బందిలేకుండా ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకుని, వాటి అమలుకు చర్యలు చేపట్టాలన్నారు. వర్షాకాలంలో ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. రోగులకు ఎలాంటి సమయంలోనైనా వైద్యసేవలు అందించేలా వైద్యులు, సిబ్బంది సన్నద్ధంగా ఉండాలని కోరారు. సీజనల్ వ్యాధులు పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు వ్యాధులు ప్రబలక ముందే అప్రమత్తంగా ఉండి, వైద్యులు పర్యవేక్షణలో వైద్యశిబిరాలను నిర్వహించాలన్నారు. వరదలు సంభవిస్తే, రహదారులు, రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉన్నందున దానికి తగ్గట్టుగా ముందస్తుగానే తగు చర్యలు చేపట్టాలన్నారు.

భారీ స్క్రీన్లపై

ప్రమాణ స్వీకార ప్రత్యక్ష ప్రసారం

రంపచోడవరంలో భారీ స్క్రీన్‌పై ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకిస్తున్న కూటమి శ్రేణులు

ప్రజాశక్తి- రంపచోడవరం : ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఇతర మంత్రివర్గం ప్రమాణ స్వీకారోత్సవ ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించేందుకు రంపచోడవరం డివిజన్ కేంద్రంలో రెండుచోట్ల ఏర్పాట్లు చేసినట్లు ఎంపిడిఒ హరికృష్ణ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో, అలాగే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమీపంలో ఎల్ఇడి స్క్రీన్‌లను ప్రజలు తిలకించేందుకు ఏర్పాట్లు చేశారు. పాల్గొన్నవారికి తాగునీరు అందించడంతోపాటు ఎస్‌బిఐ వద్ద భోజన సదుపాయాన్ని కూడా కల్పించారు. కార్యక్రమంలో ప్రతినిధులు పి.అనంత మోహన్, సిద్ధ వెంకన్న బాబు, బాపిరాజు,నిలపు సూరిబాబు, పి.శ్రీనివాస్, వయసు సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

మారేడుమిల్లి: నూతన ముఖ్యమంత్రిగా చంద్రబాబు, మిగతా మంత్రుల ప్రమాణ స్వీకారాన్ని లైవ్‌లో తిలకించేందుకుస్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఎ.వీరకిషోర్, పరిపాలనాధికారి జయంతి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. మనస్విని, ఇఒపిఆర్‌డి పి.విజయ్, మండల పరిషత్, సచివాలయ సిబ్బంది పాల్గొని ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించారు.

అంతులేని విషాదం

-పాడేరు ఘాట్ రోడ్డులో వ్యాన్ బోల్తా పడి ముగ్గురు దుర్మరణం
-9 మందికి గాయాలు
-క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించండి : కలెక్టర్

ప్రజాశక్తి - పాడేరు : అల్లూరి జిల్లా కేంద్రం పాడేరుకు 20 కిలోమీటర్ల దూరంలోని ఘాట్ రోడ్డులో మలకపోలం జంక్షన్ సమీపంలో విషాదం చోటుచేసుకుంది. బుధవారం సాయంత్రం పెద్ద వ్యాన్ బోల్తా పడి ముగ్గురు దుర్మరణం చెందారు. తొమ్మిది మందికి తీవ్రగాయాలయ్యాయి. పెదబయలు మండల కేంద్రంలో మోదకొండమ్మ పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలకు అనకాపల్లి జిల్లాలోని అచ్యుతాపురానికి చెందిన ఎస్ఎస్‌వి సౌండ్స్ నుంచి డిజె సౌండ్ సిస్టం, స్టేజ్ సామగ్రిని తీసుకెళ్లి, తిరిగి తీసుకొస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో అశోక్, లక్ష్మణ్, హరీష్ మృతిచెందారు. వీరంతా అనకాపల్లి జిల్లాకు చెందినవారు.

కలెక్టర్ పరామర్శ

ప్రమాదంలో గాయపడి పాడేరు జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని, అవసరమైతే కెజిహెచ్‌కు తరలించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో అనకాపల్లి జిల్లాకు చెందిన భీముని రవి (చాకలిపాలెం), సేనాపతి గణేష్ (సైకిల్‌వాని పాలెం), కంకిపూడి పవన్ (సోమలింగపాలెం), విదర్భ మోహన్ (యలమంచిలి), చీమలపల్లికి చెందిన లంక సునీత, లంక సూర్య దీక్షిత, లంక శ్రీను, పి.భారతి, పూడి గ్రామానికి చెందిన గొర్లి రోహిత్ కుమార్, అనకాపల్లికి చెందిన చందక రాజు, కొత్తపాలెంకి చెందిన అడారి నితిన్ చికిత్స పొందుతున్నట్టు ఆమె తెలిపారు. బాధితులు ధైర్యంగా ఉండాలని, తామంతా ఉన్నామని ఆమె భరోసానిచ్చారు. కలెక్టర్ వెంట డిఆర్‌ఒ బి.పద్మావతి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ హేమలత, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ కృష్ణారావు, టిబి కంట్రోల్ అధికారి డాక్టర్ విశ్వేశ్వరనాయుడు ఉన్నారు.

అచ్యుతాపురంలో విషాదఛాయలు

అచ్యుతాపురం : పాడేరు ఘాట్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో అచ్యుతాపురానికి చెందిన పంచదార్ల లక్ష్మణ్ అక్కడికక్కడే మృతిచెందడంతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. లక్ష్మణ్ ఇటీవల కులాంతర వివాహం చేసుకున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందినవాడు. కూలి పని చేస్తేనే పూట గడిచేది. అతనికి తల్లితోపాటు భార్య, ఆరు నెలల కుమారుడు ఉన్నారు. వారంతా పూరి గుడిసెలో జీవిస్తున్నారు. తల్లి చిలకమ్మ, భార్య లక్ష్మి లక్ష్మణ్ మృతితో కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ ప్రమాదంలో గాయపడ్డవారిలో ఎక్కువ మంది అచ్యుతాపురానికి చెందినవారు కావడంతో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

బోల్తా పడిన వ్యాను
మృతులు అశోక్, లక్ష్మణ్

వీధి దీపాలు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డులో వీధి దీపాలు పునరుద్ధరించాలని స్థానిక మండల కేంద్రం వాసులు కోరుతున్నారు. బుధవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, వీధి దీపాలు లేక పోవడంతో మెయిన్ రోడ్‌లో తిరగడానికి పలు ఇబ్బందులు పడుతున్నామని,హైవే రోడ్డు కావడం దీనికి తోడు మూగజీవాలు రోడ్డుపైనే ఉంటున్నాయన్నారు. వాహనాలు వేగంగా వస్తుండటంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నామని తెలిపారు. తక్షణమే స్థానిక పంచాయతీ అధికారులు స్పందించి మెయిన్ రోడ్డు కిరువైపులా వీధి దీపాలు పునర్దరించాలని స్థానికులు కోరుతున్నారు.

బడికి వేళాయె..!

- నేటి నుంచి పాఠశాలలు పున:ప్రారంభం

ప్రజాశక్తి-పాడేరు: వేసవి సెలవులు ముగిసాయి. ఈ నెల 13వ తేదీ నుంచి పాఠశాలలు తెరుచు కోనున్నాయి. ఇక ఇళ్ల నుంచి విద్యార్థులు పాఠశాలల బాట పట్టనున్నారు. జిల్లాలోని పాడేరు డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో ఉన్న 117 ఆశ్రమ ఉన్నత పాఠశాలలతో పాటు 667 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు 9 గురుకుల పాఠశాలలు, మూడు మినీ గురుకుల పాఠశాలలతో పాటు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు నేటి నుంచి తెరుచు కుంటాయి. ఆశ్రమ పాఠశాలల నుంచి వేసవి సెలవులకు ఇళ్లకు వెళ్లిన సుమారు 37 వేల మంది విద్యార్థిని విద్యార్థులు నేటి నుంచి పాఠశాలల బాట పట్టనున్నారు. ఈ మేరకు గత నాలుగు రోజులుగా ఆశ్రమ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో పాఠశాలల పరిసరాల పరిశుభ్రత విద్యార్థుల డార్మెటరీ భవనాలు పరిశుభ్రత తాగునీటి వసతుల మరమ్మతులు వంటి చర్యలు చేపట్టారు. నేటి నుంచి తరగతులు ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పర్యవేక్షణలో నిర్వహించారు.

స్పాట్ అడ్మిషన్లు..

ఆశ్రమ పాఠశాలలో తరగతులు వారీగా ఉన్న ఖాళీలను గుర్తించి స్పాట్ అడ్మిషన్లు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఐ.కొండలరావు ప్రజాశక్తికి తెలిపారు. ప్రతి పాఠశాలలో ఉన్న తరగతుల వారీ ఖాళీలను పాఠశాల మెయిన్ గేటు వద్ద నోటీస్ బోర్డ్ పెడుతున్నామని, వాటిని బట్టి అడ్మిషన్లు పొందే విద్యార్థులు తమ పేరెంట్స్‌తో కలిసి ఆ పాఠశాల హెచ్ఎంను కలిస్తే అర్హతలు పరిశీలించి ప్రవేశం కల్పిస్తారని ఆయన తెలిపారు. పాఠశాలలు తెరిచిన వెంటనే విద్యార్థులకు మెడికల్ స్క్రీనింగ్ టెస్ట్ లో ప్రతి ఒక్కరికి నిర్వహిస్తున్నామని, ముఖ్యంగా సికిల్ సెల్ ఎనీమియా ఉన్న వారిని గుర్తించి అవసరమైన మందుల కిట్లు, ఐరన్ మాత్రలు అందజేస్తున్నట్లు చెప్పారు.



ప్రవేశ ప్రకటన

ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల (బాలురు)
బలపం, చింతపల్లి మండలం
అల్లూరి సీతారామరాజు జిల్లా

2024-2025 విద్యా సంవత్సరానికి గాను పాఠశాలలో క్రింది తెలిపిన తరగతుల వారిగా ఖాళీలను కలిగి ఉంది. కాబట్టి తల్లిదండ్రులు మా పాఠశాల ప్రవేశాల కొరకు పాఠశాల యాజమాన్యాన్ని సంప్రదించగలరు.

క్ర.స	తరగతి	ఖాళీలు వివరాలు
1)	3వ తరగతి	40
2)	4వ తరగతి	27
3)	5వ తరగతి	25
4)	6వ తరగతి	30
5)	7వ తరగతి	21
6)	8వ తరగతి	15
7)	9వ తరగతి	35
8)	10వ తరగతి	00
	మొత్తం ఖాళీలు	193

ప్రవేశాల ప్రకటన

20, 21 తేదీల్లో సంత వేలం పాట

ప్రజాశక్తి-చింతపల్లి:మండలంలోని చింతపల్లి, లంబసింగి, లోతుగడ్డ జంక్షన్, అన్నవరం వారపు సంతల బహిరంగ వేలం పాటను ఈ నెల 20, 21 తేదీలలో నిర్వహించనున్నామని చింతపల్లి ఈఓపిఆర్డి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి, లంబసింగి, లోతుగడ్డ జంక్షన్, అన్నవరం గ్రామాలలో జరిగే వారపు సంతలకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో గతంలో వేలంపాట నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినప్పటికీ ఎన్నికల కోడ్ వున్నందున వాయిదా పడిందన్నారు.ఎన్నికల కోడ్ ముగిసినందున ఈనెల 20, 21వ తేదీలలో బహిరంగ వేలం పాట నిర్వహిస్తామని తెలిపారు. ఆశక్తి ఉన్న వారు పనివేళలలో ఆయా గ్రామ పంచాయితీ కార్యదర్శులను సంప్రదించాలని కోరారు.

జ్వరాలపై అప్రమత్తత అవసరం

● ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీలో జ్వరాలతో బాధపడుతూ ఆసుపత్రికి వచ్చిన రోగులకు వెంటనే రక్త నమూనాలు స్వీకరించి మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ జరిగితే ఆసుపత్రిలో జాయిన్ చేసుకోవాలని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఐటిడిఎ కార్యాలయపు సమావేశపు మందిరం నుంచి డివిజనల్ పంచాయతీ అధికారులు, అన్ని పిహెచ్‌సిల వైద్యాధికారులు, ఎంపిడిఒలు, మండల విద్యాశాఖాధికారులు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినర్లు, ఇఒపిఆర్‌డిలు, మలేరియా సబ్‌యూనిట్ అధికారులు, ఎంపిహెచ్ఇఒలు, సంబంధిత ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈసందర్భంగా ఐటిడిఎ పిఒ మాట్లాడుతూ, అన్ని మండలాల్లోని గ్రామాల్లో దోమలు ప్రబలకుండా ఫాగింగ్ నిర్వహించాలని, ఇంటిలోపల, బయట పూర్తిస్థాయిలో మలాథియాన్ స్ప్రేయింగ్ చేయించాలన్నారు. మన్యంలోని అన్ని ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లో స్ప్రేయింగ్, ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. రోజువారీ పిహెచ్‌సిల్లో ఎన్ని రక్తనమూనాలను సేకరించి పరీక్షలు చేస్తున్నారు, వాటిలో మలేరియా పాజిటివ్‌గా ఎన్ని కేసులు నిర్ధారణ జరిగిందీ పిహెచ్‌సి వైద్యాధికారులను ఆరా తీశారు. మలేరియా ప్రబలకుండా ఎక్కడికక్కడ తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పిహెచ్‌సిల పరిధిలో ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ఎంతెంతమంది ఉన్నారు; మలేరియా, డెంగీ నిర్ధారణ, నివారణకు సంబంధించి వ్యాధినిర్ధారణ కిట్లు, మందులు లభ్యతపై ఆరా తీసి, అవసరమైన మందులు ముందుగానే తెచ్చి, సిద్ధంగా నిల్వ ఉంచుకోవాలని ఆదేశించారు. ఏజెన్సీలోని ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే తాగునీటి నమూనాలను సేకరించి, వాటి విశ్లేషణ నివేదికలను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు జ్వరం వచ్చిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా ఆసుపత్రికి తీసుకొని వెళ్లి వైద్యం చేయించాలని ఆదేశించారు..ఆస్పత్రిలో క్లోరిన్ టాబ్లెట్లు ఉంటే వెంటనే సరఫరా చేయాలని, మరమ్మతుకు గురైనా ఫాగింగ్ మిషన్లను బాగుచేయాలని ఆదేశించారు. మలేరియా, డెంగీ, ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి రఘునందన్, గిరిజన సంక్షేమశాఖ ఇన్‌ఛార్జి డిప్యూటీ డైరెక్టర్ తేజస్విని, ఎంపిడిఒ హరికష్ణ, జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ డేవిడ్, ఎటిడబ్ల్యుఒ రామతులసి, ఎంఇఒ ఎం.రామకృష్ణ, ఎంపిహెచ్ఇఒలు పీటర్, డేవిడ్, ఆర్డబ్ల్యూఎస్ డిఇఇ రాజేంద్రబాబు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న పిఒ సూరజ్ గనోరే

రోగులకు మెరుగైన వైద్యం అందించండి

● వైద్యాధికారి, సిబ్బందికి డిఎంహెచ్ఒ జమాల్‌బాషా ఆదేశం ● సీలేరు పిహెచ్‌సి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి -సీలేరు: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి, పటిష్టమైన చర్యలు చేపట్టాలని అల్లూరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జమీల్‌భాషా ఆదేశించారు. బుధవారం జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. ల్యాబ్ రోగులు, వార్డులను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ సౌమ్య, సిబ్బందితో సమావేశమ య్యారు. అవసరమైన మందులు, మలేరియా వ్యాధి నిర్ధారణ కిట్లు లభ్యత, లీడర్ అంబులెన్స్ సేవలు రోగులకు సక్రమంగా అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు.

ఈ సందర్భంగా. రోగులకు తరలించే క్రమంలో అంబులెన్స్‌లకు ఆయిల్ కొరత ఏర్పడినప్పుడు చింతపల్లి నుంచి సీలేరు 70 కిలోమీటర్లు తీసుకురావడం కష్టతరమౌతోందని వాహన డ్రైవర్లంతా డిఎంహెచ్ఒ దృష్టికి తెచ్చారు.

సీలేరులోని పెట్రోల్ బంకులో వాహనాలకు సరిపడే ఆయిల్ తీసుకునేలా చర్యలు చేపట్టి, ఆదేశాలివ్వాలని విన్నవించారు పిహెచ్‌సి పరిధిలోని ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించి, అప్రమత్తం చేయాలని వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లకు అవగాహన కల్పించాలని డాక్టర్ జమీల్‌భాషా ఆదేశించారు.కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి కె.జోజిబాబు, హెచ్ఎస్ ఎన్.త్రినాథ్, స్టాఫ్ నర్స్ మాధురి, ఆరోగ్య కార్యకర్త సత్యనారాయణ, ఫీడర్ అంబులెన్స్ డ్రైవర్ వెంకటేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులు తనిఖీ చేస్తున్న డిఎంహెచ్ఒ డాక్టర్ జమీల్ భాషా

టిడిపి శ్రేణుల సంబరాలు

కేకు కట్‌చేసి సంబరాలు చేసుకుంటున్న తెలుగుదేశం శ్రేణులు

ప్రజాశక్తి- సీలేరు: రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు, జనసేనాని పవన్‌కల్యాణ్, ఇతర మంత్రివర్గం ప్రమాణస్వీకారం చేస్తున్న వేళ బుధవారం టిడిపి నాయకులు సంబరాలు చేసుకున్నారు. సీలేరులో టిడిపి నాయకులు కేక్ కట్ చేసి, ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు ఎస్.తిరుమలరావు, బొర్రా కృష్ణ, మాజీ ఎంపిటిసి పాంగి లూసి మాట్లాడుతూ మంచి విజన్, అనుభవజ్ఞుడైన చంద్రబాబు నాలుగోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ప్రస్తుతం సంక్షోభంలో ఉన్న ఆంధ్రాకు ఎంతో అవసరమన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంతోపాటు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చంద్రబాబు సుపరిపాలన అందిస్తారని, కూటమి పాలనలో రాష్ట్రం పురోభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ ఉప సర్పంచ్ కె.వల్లిప్రసాద్, టిడిపి నాయకులు సన్యాసిరావు, చిటికెల. రాము, నక్క. తులసి, మాధవరావు పాల్గొన్నారు.

నిరుపేద గిరిజన కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి- మోతుగూడెం : ఉండడానికి ఇల్లు లేక, ముగ్గురు చిన్నారులతో తినడానికి తిండిలేక నానా అవస్థలు పడుతున్న నిరుపేద గిరిజన కుటుంబానికి ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జమాల్‌ఖాన్ అండగా నిలిచారు. జీవనోపాధికి నిరుపేద గిరిజన కుటుంబం పడుతున్న అవస్థలను తెలుసుకున్న వెంటనే బుధవారం మోతుగూడెం అల్లూరి వీధిలోని మురాళ్ళ పరమేష్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆ కుటుంబానికి నిత్యావసరాలతోపాటు రూ. 2వేలు ఆర్థికసాయం అందించారు. నిలువనీడ లేని ఆ కుటుంబానికి జెకె ట్రస్ట్ ద్వారా ఇంటి నిర్మాణానికి కావాల్సిన సిమెంట్ రేకులు, ఇనుప పైపులు, ఇటుకలు ఇతర నిర్మాణ సామగ్రి సమకూరుస్తానని హామీనిచ్చారు. ఎంపిటిసి వేగి నాగేశ్వర రావు, చిన్నా, నల్లాశ్రీను, ట్రస్ట్ సభ్యులు ఎస్‌కె రియాజ్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

పలు రైళ్ల నెంబర్లు మార్పు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో సేవలందిస్తున్న పలు రైళ్ల నెంబర్లను వచ్చేనెల ఒకటో తేదీ నుంచి మార్చాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ క్రమంలో విశాఖపట్నం-కడప తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు 18521, కడప-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌కు 18522, విశాఖపట్నం - బనారస్ బైవీక్లీ ఎక్స్‌ప్రెస్‌కు 18523, బనారస్-విశాఖపట్నం బైవీక్లీ ఎక్స్‌ప్రెస్‌కు 18524, విశాఖపట్నం-కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్‌కు 18527, కిరండూల్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌కు 18528గా నెంబర్లను మార్చారు. అలాగే కటక్-గుణుపూర్ ప్యాసింజర్‌కు 68433, గుణుపూర్-కటక్ ప్యాసింజర్‌కు 68434, విశాఖపట్నం-కిరండూల్ ప్యాసింజర్‌కు 58501, కిరండూల్-విశాఖపట్నం ప్యాసింజర్‌కు 58502, విశాఖపట్నం-రాయ్‌పూర్ ప్యాసింజర్‌కు 58528 , రాయ్‌పూర్-విశాఖపట్నం ప్యాసింజర్‌కు 58527, విశాఖపట్నం-కోరాపుట్ ప్యాసింజర్ 58538, కోరాపుట్-విశాఖపట్నం ప్యాసింజర్‌కు 58537, విశాఖపట్నం- బ్రహ్మపూర్ ప్యాసింజర్‌కు 58532, బ్రహ్మపూర్-విశాఖపట్నం ప్యాసింజర్‌కు 58531, విశాఖపట్నం-గుణుపూర్ ప్యాసింజర్‌కు 58506, గుణుపూర్-విశాఖపట్నం ప్యాసింజర్‌కు 58505, విశాఖపట్నం-భవానీపట్న ప్యాసింజర్‌కు 58504, భవానీపట్న-విశాఖపట్నం ప్యాసింజర్‌కు 58503 నెంబర్లను కేటాయించినట్లు రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ నేతలు

సిఎం చంద్రబాబుకు యుటిఎఫ్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నారా చంద్రబాబు నాయుడి కు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యవర్గం శుభాకాంక్షలు తెలిపింది. బుధవారం అరకులోయ మండల కేంద్రంలోని ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో జిల్లా సహ అధ్యక్షులు తాంగుల చిట్టిబాబు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వి మహేశ్వరరావు మాట్లాడుతూ, ఎన్నికల సందర్భంగా అరకులో జరిగిన రా కదలి బహిరంగ సభలో జిఓ 3కు చట్ట భద్దత చేసి గిరిజన ప్రాంతంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ పోస్టులను నూటికి నూరుశాతం గిరిజన నిరుద్యోగులతో భర్తీ చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. గిరిజన ప్రత్యేక డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు యం ధర్మారావు, పి.దేముడు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కె రఘునాథ్, యం.బాబూరావు, మండల నాయకులు శెట్టి బాలకృష్ణ, గల్లెల సతీష్, కె.ఆనంద్, ఎస్.రాజు, విజయ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి-పాడేరు: ఆదివాసులతోనే అరుకు, పాడేరు నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదని కించపరుస్తూ పత్రిక ప్రకటన విడుదల చేసిన గిరిజనేతరుడు లక్కోజు నాగభూషణంపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం అల్లూరి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది.ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.ధర్మన్న పడాల్, పి.బాలదేవ్ బుధవారం ఈ విషయంపై మాట్లాడుతూ,ఆదివాసులను చులకన భావంతో అవహేళన చేయడం సరికాదన్నారు. ఆదివాసుల మధ్య తగాదాలు పెట్టేందుకు గిరిజనేతరుల కుట్రలో భాగమని, గతంలో కూడా రొబ్బి శంకరరావు అనే గిరిజనేతరుడు ఆదివాసుల హక్కులు, చట్టాలు సవరణలు చేయాలని న్యాయస్థానంలో పిల్ దాఖలు చేశారన్నారు. ఆదివాసి సమాజం కోసం పాటుపడే ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించాలని పిలుపునిచ్చారు. నాగభూషణం పై చర్యలు తీసుకోకుంటే సన్నద్ధమవుతామని హెచ్చరించారు.

ఐటిడిఎ పిఒకు ఘన సత్కారం

ప్రజాశక్తి -పాడేరు: గిరిజన విద్యార్థులు టెన్త్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించడానికి కృషి చేసిన ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్‌ను ప్రధానోపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. బుధవారం ఐటీడీఏ కార్యాలయం సమావేశ మందిరంలో పిఒ అభిషేక్, గిరిజన సంక్షేమ శాఖ డిడి కొండలరావు, పలువురు ఏటిడబ్ల్యులను ప్రధానోపాధ్యాయులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది ఇక మీదట సూపర్ 50ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

పిఒను సత్కరిస్తున్న హెచ్‌ఎంలు

ఉన్నత చదువుతోనే సమాజాభివృద్ధి

ఐటిడిఎ పిఒ అభిషేక్ సూపర్ 50 విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి-పాడేరు: ఉన్నత చదువులతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఐటిడిఏ పిఓ వి.అభిషేక్ స్పష్టం చేసారు. గిరిజన విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఐటిడిఏ ఆధ్వర్యంలో చదువే వెలుగు సూపర్ 50లో ర్యాంకులు సాధించిన 50మంది విద్యార్థులకు బుధవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నగదు బహుమతులు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రత్యేక బోధనను సద్వినియోగం చేసుకుని 50 మంది టెన్త్ విద్యార్థులు మంచి మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలోనే పాడేరు ఐటిడిఏ పరిధిలోని విద్యార్థులు మంచి మార్కులను సాధించారని చెప్పారు. ఇంటర్, డిగ్రీలో ఉన్నతంగా చదువుకోవాలని సూచించారు. 25 ఏళ్ల వయస్సు వరకు కష్టపడి చదివితే 60 ఏళ్లు సుఖ పడతారన్నారు. ఉపాధ్యాయుల కృషితోనే విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారన్నారు. సూపర్ 50 ని కొనసాగిస్తామని చెప్పారు. గిరిజన విద్యార్థులకు తగిన విధంగా ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు.గుత్తులపుట్టు ఆశ్రమ పాఠశాలలో శిక్షణ పొంది బాలికలు 30 మందిలో 23 మంది బాలికలు, దిగుమోదాపుట్టు ఆశ్రమ పాఠశాలలో శిక్షణ పొందిన 20 మంది బాలురులో 13 మంది విశాఖపట్నం మారికవలస కాలేజ్ ఆఫ్ ఎక్స్ లెన్సులో ఇంటర్మీడియట్‌లో చేరారని, మిగిలిన విద్యార్థులు పాలిటెక్నికల్ కళాశాలలో ప్రవేశం పొందారని చెప్పారు. 585 మార్కులు సాధించిన కిల్లో ధార మణికి రూ.20 వేలు, 566 మార్కు పొందిన తిరుపతికి రూ.15 వేలు, 561 మార్కులు సాధించిన టి. హరిలాల్ ప్రసాద్ కు రూ. 10 వేలు నగదు బహుమతిని, మిగిలిన 47 మందికి ఒక్కొక్కరికి రూ.2,500 చొప్పున నగదు బహుమతిని, మెమెంటోలను అందజేసారు. ఈ కార్యక్రమంలో ఐటిడి ఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వేంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు ఐ.కొండలరావు ఎటిడబ్ల్యూఓలు ఎల్.రజని, వెంకటరమణ, ప్రధానోపాధ్యాయులు టి.నాగేశ్వరరావు, జివివి. ప్రసాద్, ఎస్.సింహాచలం, ఆర్.ధర్మన్న పాల్గొన్నారు.

సూపర్ 50 విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న పిఒ

మామిడి, పనస కాయల ధరలు పతనం

లబోదిబోమంటున్న రైతులు

ప్రజాశక్తి -అనంతగిరి: గిరిజన రైతులు పండించే మామిడి, పనస కాయలకు కనీస ధర లభించ లేదు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. రైతులకు ఆదాయానిచ్చే పంటలు ఈ ఏడాది ఆశించినంత కనీస ధర లభించలేదు. బుధవారం జరిగిన డముకు, కాశిపట్నం సంతలకు కొండిభ, పెద్దబిడ్డ, లుంగపర్తి, గుమ్మ, వాలసి, వెంగడ కాశిపట్నం, తుమనవలస, బింపోలు, కాశిపట్నం పంచాయతీల రైతులు సంతలలో విక్రయించారు. మామిడికాయ ధర గత ఏడాది రూ 8 నుండి 12 రూపాయలు పైబడి ఉండగా ఈ ఏడాది రూ 3 నుండి 6లకు ధర పడిపోయింది. పనస కాయ రకాన్ని బట్టి రూ.100 నుండి 200 గత ఏడాది ధర పలకగా ఈ ఏడాది 50 నుండి100లకు పడిపోయింది. ప్రైవేటు వాహనాలలో 50 కిలోమీటర్ల దూరం నుండి వచ్చి సంతలలో విక్రయిస్తే రవాణా ఖర్చులు కూడా రాలేదని గినిజప రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటించి ఆదుకోవాలని రైతులు కోరారు.

పనస పండ్లు

మామిడి కాయలు

కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండల పరిధిలోని విద్యార్థులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు వెంటనే జారీ చేయాలని లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాధ్ కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ,పాఠశాలలు పున: ప్రారంభం కానున్న నేపథ్యంలో నూతన విద్యా సంస్థల్లో విద్యార్థులు అడ్మిషన్లు పొందుతారన్నారు.వీరికి ఎటువంటి షరతులు లేకుండా నూతన ప్రభుత్వం ధ్రువపత్రాలు జారీ చేయాలన్నారు. రేషన్ కార్డుల్లో విద్యార్థుల పేరు లేదని, కుటుంబ సభ్యుల పాత ధృవీకరణ పత్రాలు లేవని గతంలో రిజెక్ట్ చేయడంతో తల్లిదండ్రులు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారన్నారు.ఈ విషయం పై ఐటిడిఎ ప్రాజెక్టు అధికారికి వినతి పత్రం అందజేస్తామని ఆయన తెలిపారు.

136 మందికి ఏకలవ్యలో ప్రవేశం

ప్రజాశక్తి-పాడేరు:ఐటిడిఏ పరిధిలోని ఏకలవ్య కళాశాలలో 136 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించామని ఐటిడిఏ పిఓ వి.అభిషేక్ స్పష్టం చేసారు. ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థుకు బుధవారం స్థానికి ఎపిఆర్ కళాశాలలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్ మాట్లాడుతూ, 85 మంది బాలురకు, 51 మంది బాలికలకు ఏకలవ్య కళాశాలలో ప్రవేశాలకు కౌన్సిలింగ్ నిర్వహించామన్నారు. ఇంటర్మీడియట్ గ్రూపులలో ప్రవేశం కల్పించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ. కొండలరావు, ప్రిన్సిపాల్స్ ఎం.వి. రమణారావు, పి. ఎస్.ఎన్.మూర్తి, వై.పారయ్య తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డులో వీధి దీపాలు పునరుద్ధరించాలని స్థానిక మండల కేంద్రం వాసులు కోరుతున్నారు. బుధవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, వీధి దీపాలు లేక పోవడంతో మెయిన్ రోడ్‌లో తిరగడానికి పలు ఇబ్బందులు పడుతున్నామని,హైవే రోడ్డు కావడం దీనికి తోడు మూగజీవాలు రోడ్డుపైనే ఉంటున్నాయన్నారు. వాహనాలు వేగంగా వస్తుండటంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నామని తెలిపారు. తక్షణమే స్థానిక పంచాయతీ అధికారులు స్పందించి మెయిన్ రోడ్డు కిరువైపులా వీధి దీపాలు పునర్దరించాలని స్థానికులు కోరుతున్నారు.

కళాకారులను ప్రోత్సహించాలని వినతి

ప్రజాశక్తి -ములగాడ : కళాకారులకు ప్రోత్సాహం కల్పించాలని, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గాజువాక మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యాన బుధవారం కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ సిఎస్ఒ నారాయణ పాత్రుడుకు వినతిపత్రం అందజేశారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీమా-24 క్రాఫ్ట్ అధ్యక్షులు గుడివాడ శ్రీనివాసరావు, కార్యదర్శి పైడిరాజు నూనెల, కోశాధికారి ఊకోటి వెంకటేశ్వరరావు (నాని), అల్లు జోగి నాయుడు, దుబాయ్ రాజు, శరత్, జ్యోతి కుమారి, కె.మంగ తదితరులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ వద్ద ఒక్క రోజు భోజనం

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు పరిధి వేపగుంట అన్నా క్యాంటీన్ వద్ద బుధవారం బాలాజీ రామ్ ఆధ్వర్యాన ఒక్కరోజు ప్రజలకు భోజనం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా మాట్లాడుతూ, అన్నా క్యాంటీన్ పేదలకు ఎంతో ఉపయోగంగా ఉండేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చింది కాబట్టి త్వరలోనే అన్న క్యాంటీన్‌లు తెరిచే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కూటమి అఖండ విజయం సాధించిన సందర్భంగా బాలాజీ రాము ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. క్యాంటీన్ ప్రారంభించే వరకు దాతలు సహాయంతో అప్పుడప్పుడు పేదలకు భోజనం ఏర్పాటుచేస్తామని తెలిపారు. బాలాజీ రాము మాట్లాడుతూ, అన్న క్యాంటీన్ పేదలకు అనుకూలంగా ఉండేదన్నారు. అన్నా క్యాంటీన్ ప్రారంభానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అప్పారావు, మామిడి కిరణ్, దుర్గాప్రసాద్, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధపై నౌకాదళానికి శిక్షణ

ప్రజాశక్తి-మధురవాడ : కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) వల్ల కలిగే ప్రయోజనాలపై భారత నౌకాదళం అధికారులకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యాన బుధవారం ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ ముఖ్యఅతిథిగా హజరై కృత్రిమ మేధకు పెరుగుతున్న ప్రాధాన్యతను వివరించారు. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జి.లక్ష్మీశ్వరి మాట్లాడుతూ, రెండు రోజుల పాటు జరిగే వర్క్‌షాప్‌లో నౌకాదళ అధికారులకు కృత్రిమ మేధ ప్రాథమిక అంశాలు, మిషన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, న్యూరల్ నెట్‌వర్క్స్ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. గీతం ప్రొఫెసర్‌లు కె.తమ్మిరెడ్డి, డాక్టర్ జె.హైమా, డాక్టర్ శ్రీనివాస్ చక్రవర్తి తదితరులు రీసోర్స్ పర్సన్‌లుగా వ్యవహరించారు. గీతం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు హజరై శిక్షణ పూర్తిచేసుకున్న నౌకాదళం అధికారులకు సర్టిఫికెట్‌లను అందజేశారు. నౌకాదళం అధికారులకు కృత్రిమ మేధ వంటి నూతన సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇవ్వడం పట్ల గీతం అధ్యాపకులను అభినందించారు.

ఏర్పాట్లుపై సమీక్షిస్తున్న డిఆర్ఓ మోహన్ కుమార్

యుపిఎస్‌సి ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 16న రెండు సెషన్లలో జరిగే యుపిఎస్‌సి ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు జిల్లాలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణా ఏర్పాట్లుపై బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి లోపాలూ తలెత్తకుండా సమన్వయం వహించాలని, పరీక్షను సజావుగా నిర్వహించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 26 కేంద్రాల్లో పరీక్షను రెండు సెషన్లలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొదటి సెషన్ ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. మొత్తం 9,635 మంది పరీక్షకు హాజరవుతున్నారని వివరించారు. ఈ క్రమంలో అధికారులందరూ సమన్వయం వహించి పటిష్ట ఏర్పాట్లు చేయాలని డిఆర్ఓ సూచించారు. ఆయా కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలన్నారు. వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో యుపిఎస్‌సి అధికారులు, పర్యవేక్షకులు, లైజన్ అధికారులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ర్యాంకులు సాధించిన వారితో యాజమాన్య ప్రతినిధులు

ఎపిఇఎపి సెట్‌లో శ్రీవిశ్వ విజయభేరి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మంగళవారం విడుదలైన ఎపిఇఎపి సెట్ ఫలితాలలో శ్రీవిశ్వ జూనియర్ కాలేజ్ విద్యార్థులు అత్యధిక ర్యాంకులు సాధించి విజయకేతనం ఎగురవేశారు. 246, 259, 289, 314, 359, 378, 509, 556, 582, 583, 660, 658, 661, 720, 727, 749, 779, 791, 805, 828, 852, 902, 966, 974 ర్యాంకులు సాధించారు. ఈ ఫలితాల్లో ఎం.శ్రావణి 246, ఎన్.హరికృష్ణ 259, ఎస్.గీత చంద్రిక 289, వై.శ్రుతి 314, ఎం.భవ్య సంజనశ్రీ 359, ఎం.యశస్వి 378 ర్యాంకులు సాధించారు. అంతేకాకుండా రాష్ట్ర స్థాయిలో 500లోపు 6 ర్యాంకులు, 1000లోపు 24 ర్యాంకులు సాధించి చరిత్ర సృష్టించారని శ్రీవిశ్వ విద్యాసంస్థల చైర్మన్ ధర్మరాజు, డైరెక్టర్ పి.సూర్యనారాయణ తెలిపారు. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు.

వేతన బకాయి తక్షణమే చెల్లించాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : జిల్లా కేంద్రంలోని ఎన్‌టిఆర్ ఆసుపత్రి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు రెండు నెలలుగా బకాయి పడ్డ జీతాలను తక్షణమే చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్. శంకరరావు, కాంటాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ జిల్లా కన్వీనర్ వివి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలోని అనకాపల్లి జిల్లా ఆసుపత్రి, ఎలమంచిలి, నక్కపల్లి, నర్సీపట్నం, మాడుగుల, చోడవరం, కోటపాడు ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పారిశుధ్య కార్మికులపై విపరీతమైన పనిభారం పడిందన్నారు. మరోవైపు రెండు నెలలుగా టివిటి గ్రూపు కాంట్రాక్టర్ జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబపోషణకు అవస్థలు పడుతున్నారన్నారు. నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలను కల్పించడం లేదన్నారు. ఆసుపత్రి పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం రూ.16వేలు ఇవ్వాల్సి ఉండగా, ఎక్కడా అమలు చేయడం లేదని ఆరోపించారు. పారిశుధ్య కార్మికుల పట్ల సబ్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా ఉన్నారని, తగినంత సిబ్బంది లేక కార్మికులపై విపరీతంగా పని భారం పడిందన్నారు. తక్షణమే బకాయి జీతాలు చెల్లించాలని, లేనియెడల కార్మికులు ఆందోళనకు చేయకతప్పదని సిఐటియు అనకాపల్లి జిల్లా కమిటీ హెచ్చరించింది.

కూటమి శ్రేణుల సంబరాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ముఖ్యమంత్రిగా చంద్రబాబు, జనసేనాని పవన్‌కల్యాణ్‌తో పాటు మరికొందరు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేస్తున్న వేళ పాత 19వ వార్డు దిబ్బవీధి నాగేంద్రస్వామి కోవెల వద్ద తెలుగుదేశం జనసేన బిజెపి కూటమి శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచుకుని, ఒకరికొకరు అభినందనలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి మళ్ల గణేష్ మాట్లాడి చంద్రబాబుపై విశ్వాసం, పవన్‌కళ్యాణ్‌పై భరోసా, మోడీ సహకారంతో రాష్ట్ర అభివృద్ధి చెందుతుందన్న నమ్మకంతో ప్రజలు ఓటేసి గెలిపించారని, వారి నమ్మకాలను వమ్ము చేయకుండా చంద్రబాబు సుపరిపాలన అందిస్తారన్నారు. అమరావతి రాజధాని, రూ.నాలుగు వేలు పింఛను, ఇతర సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంతోపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో బాబు నడిపిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, పురందేశ్వరి రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తారన్న నమ్మకం ప్రజలకు ఉందని మళ్ల గణేష్, రామకృష్ణ అన్నారు. కార్యక్రమంలో ఆళ్ల నాయుడు, దొడ్డి నూక అప్పారావు, పీలా రమణారావు, మళ్ల మోహన్, దాడి వాసు, పొలిమేర దడేలు, మద్దాల జగదీష్, మళ్ల జగదీష్, మద్దాల వర, దొడ్డి శ్రీనివాసరావు, ఆళ్ల గోవింద, పీలా శ్యామ్ కోయిలాడ సత్యనారాయణ, వీపు రాజు, ద్రాక్షారపు జగన్ పాల్గొన్నారు.

దేవరాపల్లి : ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకార వేళ మండలంలోని పలు గ్రామాల్లో కూటమి శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. టిడిపి అభిమానులు కార్యకర్తలు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. దేవరాపల్లిలో తెలుగు మహిళ నాయకురాలు జాన దేవుడమ్మ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టి సంబరాలను నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కూటమి శ్రేణుల సంబరాలతో పండుగ వాతావరణం నెలకొంది. ఎం.అలమండలో మాజీ జెడ్‌పిటిసి పోతల పాత్రునాయుడు, వేచలంలో ఎంపిటిసి శ్రీ లక్ష్మీ బలరాం, రైవాడలో నానాజీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

మెగా కంటి వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల గ్రామంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో తుమ్మపాల వాకర్స్ క్లబ్ సహకారంతో మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. తుమ్మపాల మెయిన్ రోడ్‌లో ఉన్న పోలమాంబ తల్లి గుడి వద్ద జరిగిన శిబిరంలో 200 మంది కంటి రోగులను పరీక్షలు చేయగా 68 మందిని కంటి ఆపరేషన్ ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. అలాగే కంటి నరాలు చికిత్స కోసం ఇద్దరిని, కంటి పైపొర చికిత్స కోసం ఐదుగురిని, కంటిలో నీటి కాసుల చికిత్స కోసం ఇద్దరిని, కంటి రెప్పల చికిత్స కోసం ముగ్గురిని, చిన్నపిల్లల కంటి చికిత్స కోసం ఇద్దరిని ఎంపిక చేసి, నిపుణులైన కంటి వైద్యులతో వారికి చికిత్స అందించేందుకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో తుమ్మపాల వాకర్స్ క్లబ్ అధ్యక్షులు యేరుబండి సత్యనారాయణ, కార్యదర్శి మత్తుర్తి ఉమామహేశ్వరావు, కోశాధికారి కోసూరి బాబూరావు, దంతులూరి దిలీప్ కుమార్, పడాల గణపతిరావు, నడిపల్లి గణేశ్వరరావు, బొడ్డపాటి చిన్న రాజారావు, గొంతిన పడమటయ్య నాయుడు, శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి ఆప్తాలమిక్ ఆఫీసర్ హరి చందన, మేఘన శంకర్ ఫౌండేషన్ క్యాంపు కో ఆర్డినేటర్ సిహెచ్ అశ్వనికుమార్, నర్సింగ్ స్టాఫ్ దేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యనారాయణస్వామి దేవస్థానం పాలక మండలి రాజీనామా

ప్రజాశక్తి-అనకాపల్లి :అనకాపల్లి సూర్యనారాయణ, సత్యనారాయణ దేవస్థానం పాలకమండలి చైర్మన్, ధర్మకర్తలు బుధవారం తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కీర్తి ఆదినారాయణకు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కర్రి మహాలక్ష్మీనాయుడు మాట్లాడుతూ తమకు పదవినిచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమ పాలకవర్గ సమయంలో ఎన్నో సేవా కార్యక్రమాలు, ఆలయ ఉత్సవాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పెంటకోట అప్పలనాయుడు, విజ్జపు వాసు ముకుంద, మారిశెట్టి శ్రీను, తాడి నాగలక్ష్మి, తగరంపూడి నర్సింగరావు, మావుడూరి విద్యాసాగర్, ఎక్స్ అఫీషియో సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కెఎం నాయుడు, ఆలయ సిబ్బందికి చిరు కానుకగా వస్త్రాలు, స్వీట్స్ ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు.

నిరసన తెలుపుతున్న బిఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగులు

సమస్యలపై బిఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బిఎస్‌ఎన్‌ఎల్ నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను సత్వరం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం భోజన విరామ సమయంలో బిఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగులు నిరసన తెలిపారు. బిఎస్‌ఎన్‌ఎల్ ఎస్‌ఎన్‌టిటిఎ జాతీయ సమన్వయ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక బిఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసనను ఉద్దేశించి యూనియన్ యాక్టింగ్ ప్రధాన కార్యదర్శి జాన్ వర్గీస్ మాట్లాడారు. నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో బిఎస్‌ఎన్‌ఎల్ యాజమాన్యం సవతి తల్లి ప్రేమ కనబరుస్తోందన్నారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న వేతన సవరణను తక్షణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

హుండీ ఆదాయ లెక్కింపులో పాల్గొన్న అధికారులు, స్వచ్ఛంద సేవకులు

శ్రీ కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.59 లక్షలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పాత నగరంలో ప్రసిద్ధి చెందిన బురుజుపేట శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం హుండీ లెక్కింపు బుధవారం జరిగింది. మార్చి 21 నుంచి జూన్ 12వ తేదీ వరకు 83 రోజులకుగాను నగదు రూపంలో రూ.59 లక్షలా 16 వేలా 692 ఆదాయం లభించింది. బంగారం 13 గ్రాములా 500 మిల్లీగ్రాములు రాగా, వెండి ఒక కిలో 3 గ్రాములు వచ్చింది. ఇవి కాకుండా వివిధ దేశాలకు చెందిన కరెన్సీ కూడా వచ్చినట్టు ఆలయ కార్యనిర్వహణ అధికారి పి.శ్రీనివాసులు రెడ్డి మీడియాకు తెలిపారు. హుండీ లెక్కింపు సమయంలో ఆయనతోపాటు ఆలయ సహాయ కార్యనిర్వహణ అధికారి వి.రాంబాబు, కె.తిరుమల్లేశ్వరరావు, శ్రీ ఎర్నిమాంబ ఆలయ కార్యనిర్వహణ అధికారి డివిఎస్.సురేష్ బాబు, ఎవిఎన్.కాలేజీ యుబిఐ బ్రాంచి మేనేజర్ ఎవిఎస్.లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

ఐ లవ్ కైలాసగిరి వ్యూ పాయింట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కైలాసగిరిపై 'ఐ లవ్ కైలాసగిరి' పేరుతో ఏర్పాటు చేసిన వ్యూ పాయింట్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున బుధవారం ప్రారంభించారు. విఎంఆర్‌డిఎ అధికారులతో కలిసి వ్యూ పాయింట్‌ను సందర్శించిన ఆయన అక్కడ కాసేపు గడిపారు. అధికారులందరితో కలిసి బృంద చిత్రం దిగారు. పర్యాటకులను ఈ వ్యూ పాయింట్ విశేషంగా ఆకట్టుకుంటుందని, సెల్ఫీ పాయింట్‌గా నిలుస్తుందని, ప్రత్యేకతను చాటుకోనుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు.